క్లుప్తంగా

వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి పురస్కరించుకొని వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం సోమ వారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, మారేడు దళాలతో బిల్వార్చన అత్యంత వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఇజ్రాయిల్



సీఎం వైఎస్ జగన్‌ని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం అసెంబ్లీ వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విభజన తర్వాత ఎమ్మెల్సీ బాధ్యత అప్పగించి మాదిగలకు పెద్దపీట వేశారని ఇజ్రాయిల్ తెలిపారు. మాదిగలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఇజ్రాయిల్ కృతజ్ఞతలు తెలిపారు.

మురుగు కాలువను శుభ్రం చేయించాలి



తహసీల్దార్ పోతురాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలో భైరవ స్వామి ఆలయం నుంచి పెదబొడ్డు వెంకటాయపాలెం వరకు ఉన్న మురుగు కాలువను శుభ్రం చేయించాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కాలువను ఆనుకుని సుమారు 150 ఎకరాల ఆయకట్టు భూమి ఉందని, మురుగు నీరు దిగకపోవడంతో వరిచేలకు నష్టం కలుగుతుందన్నారు. ఈ మేరకు స్పందనలో తహసీల్దార్ ఎస్.పోతురాజుకు వినతిప్రతం అందజేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో సీపీఎం నాయకుడు టి.ఈశ్వరరావు, దాట్ల నరసింహరాజు, కె.భైరవమూర్తి, గొల్ల సత్తిబాబు, పెయ్యల బాలయోగి తదితరులున్నారు.

అక్రమ మద్యం పట్టివేత



పట్టుకున్న ఆటో, స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం సీసాలతో పోలీసులు

ఐ.పోలవరం: యానాం నుంచి అక్రమ మద్యాన్ని తరలిస్తున్న ఆటోను పాతయింజరం వద్ద ఎస్ఐ ఎస్.రాజేష్ తన సిబ్బందితో కలిసి పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి 180 ఎంఎల్ సీసాలు 230, 90 ఎంఎల్ సీసాలు మరో 230 కలిపి మొత్తంగా 460 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

హెడ్ పోస్ట్‌మాస్టర్‌కు సత్కారం



వెంకటేశ్వరరావును సత్కరించిన పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం రోటరీ క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అమలాపురం హెడ్ పోస్ట్‌మాస్టర్ డాక్టర్ మద్దెల వెంకటేశ్వరరావుకు సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి చేతుల మీదుగా నంది పురస్కారం అందజేశారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ ఆధ్వర్యంలో భాష, సాహిత్య, సామాజిక రంగాల్లో ఉభయ గోదావరి జిల్లాల్లో సేవలు అందిస్తున్న వారిని ఉగాది నంది పురస్కారాలకు ఎంపిక చేశారు. పురస్కారం అందుకున్న వెంకటేశ్వరరావును స్థానిక పోస్టల్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది సోమవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముమ్మిడివరం: కాకినాడ జగన్నాథపురంకు చెందిన పెంటబోయిన వీరబాబు ఆదివారం రాత్రి తన అత్తవారింటికి మోటారు సైకిల్‌పై వెళుతుండగా అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద అదుపు తప్పి రైలింగ్‌ను ఢీకొని పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన వీరబాబును హైవే మొబైల్ పోలీసులు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు.

కవిత్వమొక తీరని దాహం

- భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించేదే కవిత్వం
- నేడు ప్రపంచ కవితా దినోత్సవం



2022లో యానాంలో జరిగిన ప్రపంచ కవితా దినోత్సవంలో కందుకూరి కావ్య గ్రంథాలను ఆవిష్కరిస్తున్న కవులు(ఫైల్)

యానాం: కవిత్వం అనేది కళ, సాహిత్యాలకు మరో రూపం. ప్రకృతిని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందది. ఏటా మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం జరుపుతారు. 1999లో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరిగిన 30వ జనరల్ కాన్ఫరెన్స్‌లో కవిత్వం ద్వారా భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితిలో భాగమైన యునెస్కో(యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్) ప్రపంచ కవితా దినోత్సవాన్ని ఆమోదించింది. కవిత్వం సామాజిక మార్పుకోసం ఒక శక్తివంతమైన సాధనమని, అది స్ఫూర్తినిస్తుందని యునెస్కో పేర్కొంది.

తెలుగు కవిత్వంలో రాణిస్తున్న యానాం కవులు

సాహిత్యపరంగా ఘనత వహించిన ఇంజరం, పిఠాపురం, రాజమండ్రి, కోనసీమ వంటి ప్రాంతాల నడుమ ఉన్న యానాం సహజంగానే ఆ వాసనలను పుణికిపుచ్చుకొంది. తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన సాహితీవేత్తల్లో చెళ్ళపిళ్ల వెంకట శాస్త్రి ప్రముఖులు. ఆయన పదేళ్ల వయసులో ఉన్నప్పుడు విద్యాభ్యాసం కోసం 'ఫ్రెంచి యానాం వచ్చారు. 18 ఏళ్లప్పుడు యానాం వేంకటేశ్వరస్వామిపై రాసిన శతకంలో వ్యాకరణ దోషాలున్నాయని స్థానిక పండితులు విమర్శించడంతో పౌరుషం వచ్చి వారణాసి వెళ్లి సంస్కృత వ్యాకరణాన్ని నేర్చుకుని వచ్చారట. అనంతరం ఆయన కాకినాడకు మకాం వెళ్లిపోయారు. 1908లో జన్మించిన యానాం కవి గెల్లా శ్రీనివాసరావు రాసిన కవితలను దేవులపల్లి కృష్ణశాస్త్రికి చూపించినపుడు ఆయన వాటిని ఎంతగానో మెచ్చుకుని ప్రశంసించేవారట.

1932లో జన్మించిన బొల్లోజు బసవలింగం 'రాణి దుర్గావతి' అనే పద్య కావ్యం రాశారు. పంతగడ శేషమ్మ 50 ఏళ్ల క్రితమే ఠాగూర్ గీతాంజలి, ఫ్రూట్ గేదరింగ్ పుస్తకాలను అనువదించిన ప్రతిభావంతురాలు. ఫ్రెంచి యానాంలో పండితులకు, విద్యాంసులకు కొదవలేదు. ఇంద్రగంటి విశ్వపతి శాస్త్రి, సమతం కృష్ణయ్య, మహేంద్రవాడ వీరగణపతిశాస్త్రి, వంటెద్దు సుబ్బారాయుడు, కందర్ప వెంకటనర్సమ్మ ఉన్నారు. ఆధునిక తెలుగు సాహిత్య రంగానికి శిఖామణి, దాట్లదేవదానం రాజు, కె.విజయలక్ష్మి, బొల్లోజు బాబా, చెల్లి రాం, పీఎల్ఆర్ స్వామి, ముమ్మిడి చిన్నారి, పానుగుమట్ల అశోక్‌కుమార్ వంటి యానాం కవులు తెలుగు కవిత్వ చరిత్రలో కృషి చేస్తున్నారు.

తెలుగుకు పట్టం కట్టిన కలం యోధులు

ప్రపంచమొక పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం' అన్నారు మహాకవి శ్రీశ్రీ. కవిత్వం గురించి ఎంత చెప్పుకున్నా కవితాభిమానులకు తీరే దాహం కాదది. కవిత్వం లేని భాషలేదు, కవిత్వానికి అందని భావమూ లేదు. ఆధునిక తెలుగు కవుల చమత్కారాలు సైతం ఉన్నాయి. ప్రముఖ సాంఘిక సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు ఆనాటి కాలంలో సమాజంలో సాంఘిక దురాచారాలను ఖండించడానికి తన కలానికి పదునుపెట్టారు. అలా ఆయన రాసిన 'సత్యరాజా పూర్వదేశీయాత్రల్లు' అనే నవల ఆయన చమత్కార ధోరణికి అద్దం పడుతోంది. గురజాడ అప్పారావు తన కన్యాశుల్కం నాటకం ఆనాటి సమాజంలో దురాగతాలను కళ్లకు కడుతుంది. కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన 'అద్భుత కవిత్వ ప్రహసనం' ప్రాచుర్యం పొందింది. శ్రీశ్రీ సైతం తన 'మహాప్రస్థానం'తో కవనరంగంలో కదం తొక్కడం ప్రారంభించాక కొత్త ఊపు వచ్చింది... విప్లవకవిగా ముద్రపడిన శ్రీశ్రీ 'సిప్రాలి'లో చమత్కార కవిత్వం రాశారు. సిరిసిరిమువ్వలో కందపద్యాలున్నాయి. ఆరుద్ర :'కూనలమ్మ పదాలు' చమత్కారం ప్రధానంగా కనిపిస్తాయి. 'కోర్టుకెక్కినవాడు కొండనెక్కినవాడు వడివడిగ దిగిరాడు ఓ కూనలమ్మ! 'బ్రూటుకేసిన ఓటు బురదలో గిరవాటు కడకు తెచ్చును చేటు ఓ కూనలమ్మ! అంటారు. ఇలా ఎందరో మహా కవులు తమ రచనలతో కవిత్వానికి పట్టం కట్టారు.

మహా కవులను మరువకూడదు



తెలుగు సాహిత్యానికి ఎనలేని మేలు చేసిన మహాకవులెందరో ఉన్నారు. అలాంటివారిని గుర్తుంచుకోవడం ముఖ్యం. అంతేకాదు తెలుగు సాహిత్యాన్ని వ్యాప్తి చేస్తున్న యువ కవుల్ని పోత్సహించాలి. ఆ దిశగా కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ విశేష కృషి చేస్తుంది.

– డాక్టర్ శిఖామణి, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు, యానాం

చిత్తశుద్ధితో రచనలు చేయాలి



సాహితీరంగంలో విపరీత ధోరణులు విడనాడాల్సిన ఆవశ్యకత ఉంది. యువ రచయితలు చిత్తశుద్ధితో రచనలు చేయాలి. అనుభవజ్ఞులైన కవుల నుంచి నేర్చుకుంటూ కవిత్వంలో తమదైన శైలిని అలవరచుకోవాలి.

– దాట్ల దేవదానం రాజు, ప్రముఖ కవి, యానాం

ప్రభుత్వ పథకాలపై ఐఐఎఫ్టీ విద్యార్థుల అధ్యయనం

సీబీవీ పాలెం పాఠశాల సందర్శన



తాళ్లరేవు మండలంలో పర్యటించిన ఐఐఎఫ్టీ విద్యార్థులు

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, మహిళల స్వావలంబన అనే అంశాలపై ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 20 మంది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ విద్యార్థులు అధ్యయనం చేపట్టారు. సోమవారం తాళ్లరేవు మండలంలో పర్యటించి పలు శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం(సీబీవీ పాలెం) గ్రామంలోని గోదావరి మహిళా సమాఖ్యను సందర్శించి మహిళా సంఘాల పనితీరు, చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి పాఠశాలలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేఆర్‌కే సాయిప్రసాద్ అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం, నాడు–నేడు తదితర సంక్షేమ పథకాలను వివరించారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా బోధిస్తున్న పాఠాల గురించి తెలియజేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం కార్పొరేట్ తరహా విద్యా విధానాన్ని అమలు చేస్తుండడంపై ఐఐఎఫ్టీ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

సీఐ దుర్గా శేఖర్‌రెడ్డికి సత్కారం



సీఐ దుర్గా శేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల అమలాపురం పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ద్వారంపూడి దుర్గా శేఖరరెడ్డిని 'ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్' వ్యాపార ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక పట్టణ పోలీసు సర్కిల్ కార్యాలయంలో వ్యాపారులు సీఐని కలిసి కొద్దిసేపు పట్టణ ట్రాఫిక్ అంశంపై చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపార సంఘాలు, వ్యాపార ప్రతినిధులు సహకరించాలని సీఐ కోరారు. అనంతరం సీఐ దుర్గా శేఖర్‌రెడ్డిని చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపారులు సత్కరించారు. చాంబర్ గౌరవాధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ప్రతినిధులు దొమ్మేటి సాయిబాబు, చిట్టూరి పెదబాబు, చింతలపూడి సత్తిబాబు, వలవల శివరావు, కంచిపల్లి అబ్బులు తదితరులు సీఐని కలిసినవారిలో ఉన్నారు.

క్షేత్ర స్థాయిలో రేషన్ కార్డులను తనిఖీ చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం నియోజకవర్గంలో దారిద్ర్య రేఖకు దిగువనున్న వందలాది కుటుంబాలకు సైతం పసుపు రంగు రేషన్ కార్డులే ఇవ్వడం వల్ల అన్యాయానికి గురవుతున్నారని, తక్షణం రేషన్‌కార్డులను పునః పరిశీలించాలని పుదుచ్చేరి అసెంబ్లీలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా ఎరుపు రంగు రేషన్‌కార్డుకు అర్హులైన వారు సైతం ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోవడం లేదన్నారు. 1,744 కార్డులను ఎరుపురంగు కార్డులుగా మార్పు చేయాలని తాను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించానన్నారు. గతంలో మల్లాడి హయాంలో రేషన్ కార్డులు పక్కదోవ పట్టాయని మరో సభ్యుడు పేర్కొన్నారు. రేషన్‌కార్డులను మళ్లీ తనిఖీ చేస్తామని సీఎం రంగసామి, మంత్రి సాయిశర్వణన్ హామీ ఇచ్చారు. యానాం నియోజకవర్గంలో ప్రస్తుతం 9 అంగన్‌వాడీ సెంటర్లు మాత్రమే ఉన్నాయని నిబంధనల ప్రకారం మరో 22 సెంటర్ల అవసరముందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు.

పీడబ్ల్యూడీ ఓచర్ పెయిడ్ సిబ్బంది ధర్నా



పీడబ్ల్యూడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఓచర్ పెయిడ్ సిబ్బంది

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ)లో 13 ఏళ్లగా పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయం ఎదుట ఓచర్ పెయిడ్ సిబ్బంది ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీడబ్ల్యూడీ శాఖలో ఓచర్‌పెయిడ్ సిబ్బందిగా సేవలందిస్తున్న 1311 మంది సిబ్బందిని పర్మినెంట్ చేసి రూ.33 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంది రాగాంధీ సొసైటీలో పనిచేస్తున్న 700 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.18 వేల వేతనాన్ని నిర్ణయిస్తూ పర్మినెంట్ చేశారని, వారు తమకన్నా రెండేళ్ల వెనుక జాయిన్ అయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి నాగబాబు, మన్నే శేఖర్, ఇసుకపట్ల ప్రవీణ్, అడపా దయానందస్వామి, అచ్చుతరామరాజు తదితరులు పాల్గొన్నారు.

బండి దారి కల్పించాలని వినతి

అమలాపురం రూరల్: పంట పొలాలకు వెళ్లేందుకు బండి దారి కల్పించాలని కోరుతూ పలువురు రైతులు సోమవారం మండల స్థాయి స్పందనలో ఫిర్యాదు చేశారు. రోళ్లపాలెం పరిధిలో 275 ఎకరాల పంట పొలాలున్నా సరైన మార్గం లేక తరచూ ఇబ్బందులు పడాల్సి వస్తుందని తహసీల్దార్ పరమట శ్రీపల్లవికి విన్నవించుకున్నారు. పూర్వం నుంచి 503 సర్వే నెంబర్ భూముల నుంచి బండి మార్గం ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగించేవారమన్నారు. అయితే ఆ సర్వే నెంబర్‌లోని 1.36 సెంట్ల భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించడంతో దారి లేక పండించిన ధాన్యం, కొబ్బరికాయలు ట్రాక్టర్ ద్వారా తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దార్‌కు వివరించారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో మట్ట సాయి రామారావు, రంకిరెడ్డి ఏసుబాబు, నగబేరి జ్యోతి, రంకిరెడ్డి సూర్యనారాయణ తదితరులున్నారు.

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ హసీనా

రావులపాలెం: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ హసీనా అన్నారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని మెర్లపాలెం హైస్కూల్‌లో క్షయ వ్యాధిపై పాఠశాల పిల్లలందరికీ, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించినట్టు డాక్టర్ హసీనా తెలిపారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వ్యక్తికి ఆకలి మందగించడం, రెండు వారాలకు మించి దగ్గు, తెమడ పడడం, జ్వరం, బరువు తగ్గి శుష్కించిపోవడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఊబలంక ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ఖరీదైన మందులు ఉచితంగా ఇవ్వడంతో పాటు చికిత్స అందిస్తామన్నారు. అలాగే వారికి పోషకాహారం నిమిత్తం నెలకు రూ.500 అందజేస్తామన్నారు. క్షయ వ్యాధి రాకుండా పాఠశాల పిల్లలు, ప్రజలందరూ అవగాహన కలిగి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు ఎంఎస్ఎస్ సాయిరాం, పీడీడీ బిషప్, సూపర్‌వైజర్ రెడ్డి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, రత్నకుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఫీవర్ సర్వే



పెనికేరులో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య, ఆశ సిబ్బంది

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అకారణంగా సంభవిస్తున్న జ్వరాలు, అనారోగ్య సమస్యలపై సర్వే చురుగ్గా జరుగుతుంది. కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత ఆదేశాల మేరకు వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు తదితరులు ఆరోగ్య, ఆశ సిబ్బంది చేత ఈ సర్వేను చేయించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. జ్వరపీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి సత్వరమే ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి ఉపయోగించు విధానాన్ని తెలియజేస్తున్నారు. సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా వైద్యారోగ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని అదనపు జిల్లా వైద్యాధికారి సుమలత పేర్కొన్నారు. హెచ్‌వీలు పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం

అమలాపురం రూరల్: జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రం ద్వారా సోమవారం స్పందన కార్యక్రమంలో పాల్గొన్న అర్జీదారులకు చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతుల చేతుల మీదుగా మజ్జిగ అందించారు.

గురుకులం విద్యార్థులకు స్టేషనరీ వితరణ



విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న రమణారావు

అల్లవరం: గోడిలోని బాలురు, బాలికల గురుకులంలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు సోమవారం అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఫౌండేషన్ ప్రతినిధి రమణారావు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ నెల్లి సాయిబాబు, ఉమాకవిత, రేవు తిరుపతిరావు, బొంతు రమణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బేటీ బచావో బేటీ పడావో ర్యాలీ

యానాం: దేశంలో లింగనిష్పత్తిలో తేడాలకు ప్రధాన కారణం భ్రూణ హత్యలకు పాల్పడమేనని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సత్తెప్పనాయుడు అన్నారు. సోమవారం కమ్యూనిటీ సర్వీస్ స్కీం కార్యాచరణలో భాగంగా విద్యార్థులు బేటీ బచావో బేటీ పడావో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణ సుధాకర్, హెచ్ఎం నాగ నళినీకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

ముసలమ్మ వారికి వెండి వస్తువుల సమర్పణ

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు పుంతలో ముసలమ్మ వారికి ఆ ఆలయ కమిటీ నిర్వాహకులు వెండి మకరతోరణం, కిరీటాన్ని సోమవారం సమర్పించారు. వెండి వస్తువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మంగళవారం అమ్మవారి జాతర, బుధవారం తీర్థం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

పాఠశాలకు పలు వస్తువుల అందజేత



దాత అందించిన బీరువాను ప్రారంభించిన ఎంఈఓ విజయశ్రీ

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామానికి చెందిన ఎన్నారై చొప్పల రాజశేఖర్ స్థానిక పాఠశాలకు రూ.30 వేలు విలువైన వస్తువులను అందజేశారు. సోమవారం పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు అందజేశారు. ఐరన్ బీరువాతో పాటు కుర్చీలు, హాట్ అండ్ కూల్ వాటర్ డిస్పెన్సర్, ప్లేట్లు, గ్లాసులను ఎంఈవో విజయశ్రీకి అందజేశారు. ఆమె మాట్లాడుతూ దాత సేవలను అభినందించారు. దాత రాజశేఖర్‌ను వేదికపై సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైవీ పద్మనాభం, సొసైటీ అధ్యక్షుడు చొప్పల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఉగాది వేడుకలు



ఉగాది వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యా నిధి స్కూలులో శ్రీశోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు రోజుల ముందే సోమవారం సాయంత్రం ఉత్సాహంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఉగాది పూజలు చేశారు. పంచాంగ శ్రవణం గావించారు. ఉగాది పచ్చడిని తయారు చేసి అందరికీ రుచి చూపించారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, స్కూలు ప్రిన్సిపాల్ టీఎస్ మాధవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కురంగేశ్వరునికి లక్ష రుద్రాక్ష పూజ



కురంగేశ్వరస్వామికి లక్ష రుద్రాక్ష పూజ చేస్తున్న ఆలయ అర్చకులు

తాళ్లరేవు: పవిత్ర మాసశివరాత్రి సందర్భంగా పాత కోరంగి శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వర స్వామికి లక్ష రుద్రాక్ష పూజా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక రామకృష్ణ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి లక్ష రుద్రాక్ష పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యానాం కోపరేటివ్ స్టోర్స్ సిబ్బంది నిరసన

యానాం: దీర్ఘకాలంగా ఉన్న తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం యానాం కోపరేటివ్ స్టోర్స్ సిబ్బంది స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 30 నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈసారి కోపరేటివ్ సొసైటీ ద్వారా సుమారు రూ.3 కోట్ల వ్యాపారం నిర్వహించగా రూ.60 లక్షల మేర లాభం వచ్చిందని, అయినా జీతాలు ఇవ్వాలని కోరుతుంటే సొమ్ములు లేవని కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాలయాపన చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆర్ఏఓ మునిస్వామి నిరసనకారులతో చర్చించారు. రానున్న 15 రోజుల్లోగా 10 నెలల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. నిరసన కార్యక్రమంలో నాయకులు పువ్వల శ్రీనివాస్, జాఫర్, రమణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

అమలాపురం రూరల్: పంచాయతీ స్థలాల్లోని కొబ్బరి చెట్లను వ్యవసాయ కార్మికులు, పేదలు, దళిత బలహీన వర్గాలకు పంపిణీ చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కోనసీమ జిల్లాలోని ఎదురులంక రేవు నుంచి సఖినేటిపల్లి రేవు వరకు రోడ్లకు ఇరువైపులా పంచాయతీ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ గట్లపై ఉన్న చెట్లను ఇవ్వాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో కుడిపూడి రాఘవమ్మ, సఖిలే సూర్యనారాయణ, పి.వసంత్ కుమార్, రేవు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన మాస్టర్ ఇన్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేలాయుధం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టాప్‌గ్యాప్ ఎంగేజ్‌మెంట్ విధానం గంటల ప్రాతిపదికన భర్తీ చేసే ఈ ఉద్యోగానికి ఎంపీఈడీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31లోగా అందజేయాలని చెప్పారు.